# బాధకానిది

## 'మోనాలిసా'

విసుగేసి చూస్తున్న పత్రికని టేబుల్ మీదకి గిరాటు కొట్టింది. అర్థకంగా ఆవులిస్తూ వొళ్ళు విరుచుకుంది. "ఏమిటి ఇంకా రాలేదు?"

టేబుల్ మీది అలారం టైంపీస్ వైపు చూసింది. పదీ అయిదు.

పిల్లలు ముగ్గురూ గాఢనిద్రలో ఉన్నారు. ఆమె మంచంమీదినుంచి లేస్తుండగా వినిపించింది.

'టక్ టక్ టక్'మన్న తలుపు చప్పుడుని వెన్నంటి పిలుపు "రాజ్యం"

"ఆం వస్తున్నా!" గబగబా నడిచి వెళ్ళింది.

గడియతీసి తలుపులు తెరిచింది. భర్త లోపలికి వచ్చాక తిరిగి తలుపులు వేసేసి. లోపలికి నడుస్తున్న అతడ్ని అనుసరిస్తూ అడిగింది

"స్నానం చేస్తారా?"

"ఊహూం" తల అడ్డంగా ఊపాడు.

"అయితే అన్నం పెట్టేస్తాను"

వంటింట్లోకి నడవబోయింది.

"వద్దు అప్పుడే!" అతడి మాటకి ఆగిపోయి భుజంమీదుగా తలతిప్పి చూస్తున్న రాజ్యలక్ష్మితో అన్నాడు మధుమూర్తి

"నీతో ఒక విషయం చెప్పాలి"

ఆమె ముఖం ప్రశ్నార్థకంగా అయింది.

"వచ్చి అలా కూర్చో!" అతడి సౌంజ్ఞననుసరించి మంచంమీద కూర్చుంది.

అతడు మౌనంగా బట్టలు మార్చుకోసాగాడు. పాంటూ, షర్టూ స్టాండ్‌మీద పడేసి, లుంగీ కట్టుకున్నాక, కిటికీవద్దకు నడిచి బైటకు చూస్తూ నిలుచున్నాడు.

ఆ కొద్ది నిమిషాలు రాజ్యలక్ష్మి ఆరాటంగా చూసింది, భర్త చెప్పబోయేదేమిటని. మామూలు సంగతే అయితే యధాలాపంగా చెప్పేస్తాడు 'ఒక విషయం చెప్పాలి' అని మెన్షన్ చేశాడంటే ఏదో ప్రత్యేకత ఉన్నట్లు! ఏమిటది? ఆలోచిస్తున్న ఆమె మనసు. అతడు కిటికీవద్దకెళ్ళి ముఖం అటు తిప్పి నిలుచున్నప్పుడు కీడుని శంకించింది.

మరికొద్ది నిమిషాల మౌనం తర్వాత చెప్పాడతడు

"నేను మరో పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను"

పిడుగులా వినబడింది ఆమెకా మాట! నిశ్చేష్ఠురాలైంది.

"ఎందుకు? మీరెందుకు మరో పెళ్ళి చేసుకోవాలనుకోవటం? అంత అవసరమేమిటి? నాలో ఏమైనా లోపం వుందా? నేను మీకేమైనా లోటు చేశానా? ఇది మీకు న్యాయమేనా? చెప్పండి" గట్టిగా అడగవలసిన ఈ మాటలు ఆమె మనసు లోనే ఉండిపోయాయి.

గుండెలో కైజారు దిగబడినట్టు భావన. మంచంమీద చైతన్యరహితంగా కూర్చుండిపోయింది.

ఆమె ముఖకవళికలు పరిశీలించటంకోరకన్నట్లు ఒకసారి వెనుదిరిగి చూసి, మరల తలత్రిప్పుకొని చెప్పాడు మధుమూర్తి.

సుశీల భర్త ఆమెద్వారా పిల్లలు కలిగేందుకు వీలులేదని తెల్సుకుని రెండో పెళ్ళిచేసుకున్నాడు. రెండో పెళ్ళి చేసుకున్నా సుశీలను నిర్లక్ష్యం చెయ్యలేదు. ఏ లోటూ రాకుండా అనురాగవాత్సల్యాలతోటే చూచుకొనేవాడు.

"న్యాయమో, అన్యాయమో నాకనవసరం. నేను సుజాతను పెళ్ళి చేసుకోదల్చుకున్నాను. ఆమె మా ఆఫీస్‌లోనే పనిచేస్తూంది టైపిస్ట్‌గా. చాలా అందంగా ఉంటుంది"

కిటికీవదనుంచి కదిలి, గదిలో పచార్లుచేస్తూ చెప్పసాగాడు.

"ఆమెను చేసుకుని నీకేదో అన్యాయం చేస్తానని. నిన్ని యింట్లోంచి గెంటేస్తానని నువ్వేం భయపడనక్కరలేదు నీ ఎప్పటి స్థానం నీకుంటుంది. నిన్ను అవమానించటంగానీ, మరోవిధంగా అవస్థపెట్టటంగానీ చెయ్యను. చెయ్యనివ్వను"

"సుజాతను నేను గాఢంగా ప్రేమిస్తున్నాను. ఆమె లేనిదే బ్రతకలేను. ఆమెకన్నీ చెప్పాను. నేను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న సంగతి కూడా! అయినా జీవితాంతం నా భార్యగా ఉండటానికి వొప్పుకుంది. సుజాత మనతో, మన యింట్లోనే ఉంటుంది"

చెప్పటం పూర్తిచేసి, మడత మంచం వరండాలోకి తీసుకుపోయి వేసుకుని పడుకున్నాడు మధుమూర్తి

ఆలోచనలతో రాజ్యలక్ష్మికి ఆ రాత్రి కాళరాత్రే అయింది.

భయంకరమైన సమస్యముందు నిలచి, ఆమెను నిద్రకు దూరం చేసింది.

ఏ స్త్రీ కూడా ఎదుర్కొనేందుకు సంసిద్ధురాలు కాలేని సమస్య.

భోంచెయ్యాలి, భర్తకు భోజనంపెట్టాలి అన్న ఆలోచనే ఆమెకు రాలేదసలు. భూతంలా సమస్య ఎదురుగా నిల్చున్నప్పుడు భోజనంపైకి మనసెలా పోతుంది? ఎలా సహిస్తుంది?

పెళ్ళిచూపుల రోజున అతడ్ని చూసి ఎంతగా ఉప్పొంగిపోయింది. మన్మధునివంటి మనోహరమైన రూపం! మగవాళ్ళలో ఆ అందం అసాధారణం. పెళ్ళిలో తన తోటివాళ్ళందరూ అన్నారు, 'సినిమా హీరోలాంటి మొగుడే!' అని. తనకు అంత అందమైనవాడు దొరికినందుకు అసూయ కూడా చెందకపోలేదు. అప్పుడు తను ఎంతగా మురిసిపోయింది?

తన పెళ్ళయ్యాక, తను చెయ్యవలసిన పనులు ఇక ఈ లోకంలో లేవనుకొన్నాడేమో; తనకున్న ఒక్కగానొక్క పెద్దదిక్కు తండ్రి చనిపోయాడు. ఇటు భర్తవైపు కూడా దగ్గర బంధువులు ఎవరూ లేరు

పెళ్ళయ్యాక తెలుసుకుంది, అతడికి స్త్రీ వ్యసనం ఉందని.

కానీ సహించింది. బైట ఏ విధంగా తిరిగినా తనకుమాత్రం ఏ లోటూ చెయ్యకుండా, ఆప్యాయంగా చూచుకొనేవాడు అందుకు–

కానీ...ఇప్పుడు...ఇప్పుడు మరో పెళ్ళి చేసుకొంటానంటున్నాడే-

ఎలా? ఇప్పుడెలా?

ఇతడినుంచి విడిపోతే?

పుట్టింటి తరఫున తనను ఆదుకొనేందుకు ఎవరూ లేరు.

విడిపోయి ఉద్యోగం చేసుకోవచ్చు. కానీ తను చదివింది ఎనిమిదో తరగతి. ఈ చదువుకి ఈ కాలంలో ఉద్యోగం దొరుకుతుందనుకోవటం అవివేకంకదూ?

మరి?

ఏమిటి మార్గం?

ఈ పెళ్ళి జరగకుండా చెయ్యాలి.

ఎలా?

ఇతడ్ని మందలించి, విరమింపజేసేందుకు ఇతగితరఫు బంధువులెవరూ లేరే-

ఆలోచిస్తే ఒకటే అన్పిస్తూంది.

తనకిప్పుడు రెండే రెండు మార్గాలు.

ఆత్మహత్య చేసుకుని ఈ జీవితాన్ని చాలించటం...

లేదా బతికి వుండి సుజాతతో కలిసివుండటం.

ఆత్మహత్య చేసుకుంటే...మరి పిల్లలేమవుతారు? ఆ సుజాత బతికనిస్తుందా పిళ్ళను?

పోనీ, వాళ్ళను కూడా తనతోపాటు చంపేస్తే?

అమ్మో! అలా చెయ్యగలదా తను? తన బిడ్డల్ని తన చేతులతో చంపుకోగలదా?

ఆ ఆలోచననే భరించలేకపోయింది.

ఎవరో ఒంట్లోని శక్తినంతనీ లాగేసినట్లు నిస్సత్తువగా మంచంమీద వాలిపోయింది.

ఇక తప్పదు!

సుజాతను చిరునవ్వుతో ఆహ్వానించాలి.

కానీ...అలా చెయ్యగలదా తను?

ఆమెతో తన భర్తను పంచుకోగలదా?

గత్యంతరం లేదుగనక తను వుందొచ్చు కానీ ఆమె? సవతిగా తనను సరిగ్గా చూస్తుందా?

భర్త అవమానించటం, కష్టపెట్టటం చెయ్యనివ్వనని హామీనిస్తున్నాడుగాని, ఆచరణలో అది సాధ్యమవుతుందా?

చప్పున స్నేహితురాలు సుశీల విషయం గుర్తుకొచ్చింది.

సుశీల భర్త ఆమెద్వారా పిల్లలు కలిగేందుకు వీలులేదని తెల్సుకుని రెండో పెళ్ళి చేసుకున్నాడు. రెండో పెళ్ళిచేసుకున్నా అతడు సుశీలను నిర్లక్ష్యం చెయ్యలేదు. ఆమెకు ఏలోటూ తెలియనీయకుండా మునుపటి అనురాగ వాత్సల్యాలతోటే చూసుకొనేవాడు. ఇది రెండో భార్యకి కన్నెర్ర అయింది. భర్తలేని సమయంలో సుశీలను ఏదో ఒక విధంగా సాధించి, వేధించటం ప్రారంభించింది. చివరకి విరక్తితో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది సుశీల.

అంటే...తనకూ అలాగే జరుగుతుందా?

తనూ జీవితాన్ని...చివరికి ఆత్మహత్యతో ముగిస్తుందా?



లేదు...అలా జరగకూడదు.

అందుకు సుజాత తన సవతిగా ఈ యింట ప్రవేశించగూడదు.

అందుకేం చెయ్యాలి?

ఆలోచనలతో ఆమె నిద్రకు దూరమైంది.

మరునాటిరోజు—

రాజ్యలక్ష్మి భర్తతో ఎప్పటివలె మామూలుగా ప్రవర్తించింది.

రాత్రి తను చెప్పినదానికి దుఃఖపడుతున్న ఛాయలు ఆమె ముఖంలో లేకపోవటం మధుమూర్తికి విస్మయాన్ని కల్గించినా, ఆ భావాన్ని తన ముఖంలో తెలియకుండా జాగ్రత్తపడ్డాడు

అతడు ఆఫీసుకి వెళ్తుండగా— "దయచేసి ఇవాళ సాయంత్రం సుజాతను ఇంటికి తీసుకొస్తారా? ఆమె నొకసారి చూడాలని ఉంది" అన్నది నవ్వుతూ.

మధుమూర్తి ఆమెకేసి ఒకక్షణం విస్మయంగా చూచి, "సరే" అంటూ వెళ్ళిపోయాడు

సుజాతతో చెప్పవలసింది ఏమిటో తర్కించుకొంటూ, ఆ రోజంతా అన్యమనస్కంగా గడిపింది రాజ్యలక్ష్మి.

సాయంత్రమైంది. పిల్లలు ముగ్గురినీ డబ్బులిచ్చి సినిమాకి పంపేసింది.

ఆరవుతుండగా వచ్చింది సుజాత.

నయమే! భర్త రాలేదామెతో

ముప్పై సంవత్సరాలుండొచ్చు ఆమె వయసు. భర్త చెప్పింది నిజమే! చాలా అందంగా, అందానికి నిర్వచనంగా చూపించదగినట్లు ఉంది.

కూర్చోమని, టీ చేసి ఇచ్చింది.

ఆమె నుంచి ఈ రకమైన ప్రవర్తనను ఊహించలేదేమో? రాజ్యలక్ష్మి కేసి ఆశ్చర్యంగా చూడసాగింది సుజాత.

టీ త్రాగటం పూర్తి చెయ్యనిచ్చి అడిగింది రాజ్యలక్ష్మి.

"భార్య బ్రతికి ఉండి, ముగ్గురు పిల్లల్ని కలిగి ఉన్న ఈయన్ని నువ్వెందుకు పెళ్ళి చేసుకోదల్చుకున్నావో తెల్సుకోవచ్చా?"

చెప్పింది సుజాత

"ఆమె తలిదండ్రులు మధ్యతరగతి కుటుంబీకులట. వారికి పుట్టిన ఆరుగురు సంతానంలో ఆడసంతానంలో తను ఆఖరిదట. అయిదుగురు పిల్లల పెళ్ళి చేసేటప్పటికి తండ్రి వొంట్లో శక్తి, ఇంట్లోని ఆర్థిక వనరులు క్షీణించాయట. తనను ఎస్సెస్సెల్సీ చదివించి, టైపు పరీక్షలకి కట్టించి, "ఇక మీ అమ్మను పోషించవలసిన బాధ్యత నిదే" అని చెప్పి తండ్రి కన్ను మూశాడట. ఆయన చనిపోయిన కొద్ది కాలానికి, "కూతురికి పెళ్ళి చెయ్యలేకపోయా" మన్న దిగులుతో కృశించిపోయి, తల్లికూడా తండ్రిని చేరుకుందట. తన అందం చూసి 'టెంపరరీ'గా ఉంచుకోదలచిన వారే తప్ప, కట్నం లేకుండా 'పర్మనెంట్'గా భార్యా పట్టం కట్టదలచిన వారు ఈ కలియుగంలో లేరని ఇప్పటికి నిర్ణయించుకుందట మగడిక్కు అన్నగ ఒకడు ఉండాలి గనుక, సహృదయుడు (?) అందగాడు అయిన మధుమూర్తినిపరస్పరాంగీకారంతో, పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకొందట!"

సుజాత తన కథను పూర్తి చేసేటప్పటికి రాజ్యలక్ష్మి హృదయం జాలితో నిండిపోయింది.

కాని ఆమె మనసు తన భర్తను, మరొకరికి భర్తగా అంగీకరించలేదు

ఆ సమయంలో ఆమె లక్ష్యం ఒక్కటే! సుజాత తన సవతిగా ఈ ఇంట ప్రవేశించరాదు. అందుకే అన్నది.

"ఈయన్ని పెళ్ళి చేసుకుంటే స్త్రీ జీవితానికో అపురూప వరమైన మాతృత్వాన్ని పొందే అవకాశంలేదు తెలుసా"

"తెలుసు ఆయన చెప్పారు. అయినా ఆయన ద్వారా మీకు ముగ్గురు పిల్లలు కలిగారు వాళ్ళు మాత్రం నా పిల్లలు కారా?"

సుజాత ధోరణిని ఎలా అర్థం చేసుకోవాలో రాజ్యలక్ష్మికి తెలియలేదు.

కాసేపు ఆలోచించింది

"కాని నువ్వాయన్ని పెళ్ళి చేసుకుంటే నలుగురిని చంపిన హంతకివి అవుతావు"

"నేనేమిటి? హంతకిని కావటమేమిటి?" సుజాత కనుబొమలు ముడివేసి చూచింది, అర్థం కాని భావంతో

"ఆయన్ని పెళ్ళాడి నువ్వీయింట అడుగు పెట్టిన మరుక్షణం, నేనూ, నా పిల్లలూ శవాలుగా మారటం జరుగుతుంది" స్థిరమైన కంఠంతో అన్నది రాజ్యలక్ష్మి.

సుజాత పడిన దిగ్భ్రమ ముఖంలో స్పష్టమవుతూంది. కాసేపటివరకూ మాట్లాడలేకపోయింది.

"ఏమిటి మీరంటున్నది? నాకు అర్థంగావటం లేదు" అన్నది చివరకి గొంతు పెగుల్చుకొని.

"నా భర్తను నీతో పంచుకోవటం నాకిష్టం లేదు ఆయనతో నీ పెళ్ళి జరిగిననాడు నా పిల్లల్ని చంపి, నేనూ ఆత్మహత్య చేసుకొంటాను" చెప్పింది రాజ్యలక్ష్మి

"అయితే దానికి నేనలా కారణం అవుతాను?"

సుజాత కంఠంలోని నిర్లక్ష్యానికి విస్మెరబోయింది రాజ్యలక్ష్మి

"నవ్వు కాక?"

ఆ ప్రశ్న అడిగిన తీరులో ఆమె ఎంత కంగు తిన్నదీ వెల్లడవుతూంది.

"మీ మూర్ఖత్వమవుతుంది నేను ఈ పెళ్ళిని ఆశించింది ఒక మగతోడు కోసమని పెళ్ళయాక మీతో సఖ్యంగా ఉండాలని కూడా నిర్ణయించుకొన్నాను. అది అర్థం చేసుకోకుండా మీరు మీ పిల్లల్ని చంపేసి, ఆత్మహత్య చేసుకుంటానంటుంటే— మీ మూర్ఖత్వానికి జాలేస్తున్నది. మీరెం చెప్పినా నా నిర్ణయం మారదు చెయ్యబోయేది మీరే నిర్ణయించుకోండి" అనేసి చరచరా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది సుజాత.

రాజ్యలక్ష్మి అవాక్కయిపోయి, స్థాణువులా నిల్చుండిపోయింది.

సుజాతతో ఆ మాట అన్పించింది, రాజ్యలక్ష్మి హెచ్చరిక కేవలం బెదిరింపే అన్న అభిప్రాయమా? లేక ఆమె స్వార్థమా?

స్వార్థమే అయితే ఆమెలో అది ఒక స్త్రీ. ముగ్గురు పిల్లల క్షేమాన్ని కూడా ఖాతరు చెయ్యనంత ఎక్కువ స్థాయిలో ఉందా?

స్త్రీకి స్త్రీయే శత్రువన్న మాట నిజమేనా? ఆ నిజానికి నేటి సంఘంలో వేళ్ళు పాతుకొని ఉన్న వరకట్నసమస్యే మూలకారణమేమో? ✱

పీడకల

మల్లిక్

